


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### ఏప్రిల్ ఫూల్

**సందానీ** ఆదరా బాదరా నాలుగు బట్టలు సంచిలో కుక్కుకున్నాడు. బిజిలీకి నాలుగు ఆకులు తినిపించి, దాని మెడ కావిటేసుకుని ముద్దు పెట్టుకున్నాడు.

అమ్మీజాన్ "పాశం వండాను రా. తినకుండా ఏడకి బోతున్నావ్?" అంటున్నా వినిపించుకోలేదు.

"నేను ఉత్తరం రాస్తయి, పోయినంక" అని పరుగు తీసాడు.

అమ్మమ్మ పిండి వుడికించి ఇస్తే, మంచం మీద బట్ట పరిచి వడియాలు పెడ్తున్న నేను, మిద్దెమీద నుండే "ఎక్కడికిరా పోతున్నావ్?" అని కేకేసాను.

సందానీ నాకేసి చూసి, "బిజిలీకి ఆకులు తినిపించు దినాం" అని చెప్పి పరుగు తీసాడు.

అమ్మమ్మ వాకిట్లో కొచ్చి "ముంతాజ్ ఎక్కడికెళ్తున్నాడు వాడు?" అని అడిగింది.

"ఏమో పంతులమ్మా సల్ల నీళ్ళే పోసుకుని వురకబట్టిండు. ఏడకి అంటే సెప్త లేడు" అంది వాళ్ళమ్మ.

ముంతాజ్ బేగం భర్త షాజహాన్ కదా. కానీ ఇక్కడ వేరే పాపం. ఖాన్ తూలుతూ వచ్చి "ఖానా దో" అని అరిచాడు.

"దీనికి మాత్రం నా కడకే వస్తవ్. నీ సిన్న పెళ్ళాం తాన తిని రాకపోయావు" అని బేగం లోపలికి వెళ్ళింది. ఇంక కాసేపట్లో బ్యాండ్ మేళం వినిపించింది. అంటే అతని తన్నులూ, ఆమె ఏడుపూ. కానీ బేగం కూడా తక్కువ తినలేదు. అతను కొడ్తున్నంత సేపు నోరు మూయకుండా జవాబులిస్తూనే అతన్ని రెచ్చగొడుతూనే వుంటుంది. సాధారణంగా జరిగే ప్రక్రియే ఇది.

రంగనాథం మేష్టారు నేను స్కూల్‌కి వెళ్ళగానే నన్ను దగ్గరకి పిలిచి "ఈ సందానీగాడేడీ?" అన్నారు.

"ఏమో సార్. పొద్దుటే సంచి భుజాన వేసుకుని బస్టాండ్ వైపు వెళ్ళాడు" అన్నాను.

"సరే ఈ రోజు సగం పూటే స్కూల్" అన్నారు. పిల్లలందరూ చప్పట్లూ, పుస్తకాల సంచి మీద కంపాస్ బాక్స్‌తో బాదుతూ తమ హర్షం ప్రకటించారు.

అప్పుడు రంగనాథం మేష్టారు తాపీగా చెప్పారు. "ఎందుకంటే మీ అందరికీ ఈరోజు కలరా రాకుండా వేక్సినేషన్ ఇస్తారు"

ఆ మాటకి శీనుగాడు "తియ్యగా వుంటుందా  సార్ రంగు సోడాలాగా?" అన్నాడు.

అప్పుడెప్పుడో ఓసారి స్కూల్ కొచ్చి షర్బత్ ఇచ్చారు ప్రమోషన్ కోసం ఒకళ్ళు.

రంగనాథం మేష్టారు నవ్వి "తీపుగా వుంటుందిరా జబ్బ మీద. తియ్యగా కాదుగానీ" అన్నారు.

"అంటే?" అడిగాను నేను.

"అంటే ఇంజెక్షన్. నేను నిన్న సందానీతో డాక్టర్ గారికీ, కాంపౌండర్‌కి కూడా ఈ విషయం చెప్పి, అక్కడెవరున్నా చిన్న పిల్లలుంటే ఆస్పత్రిలో స్కూల్‌కి పంపమని చెప్పి రమ్మన్నాను. వాడు చెప్పాడో లేదో నాకొచ్చి మళ్ళీ చెప్పలేదు" అన్నాడాయన.

"ఈ విషయం మీరు సందానీకి చెప్పారా సార్? అందుకే వాడు పారిపోయాడు" అర్థమై పోయి అన్నాను నేను.

"అమ్మో! నాకొద్దు సార్. నీ కాళ్ళకి దణ్ణం పెడ్తా. ఇడసి పెట్టండి సార్. ఇడసి పెట్టండి" జాన్‌గాడు లేచి, సార్ కాళ్ళకి దణ్ణ పెడ్తూ ఏడ్చాడు.

ఏడుకొండలూ, శీనుగాడూ, గోపీ, అందరూ వెంటనే తామూ కాళ్ళూ చేతులు కొట్టుకుని ఏడుస్తున్నారు.

"ఒద్దు సార్ పోయిన సారి ఇచ్చిన చోట ఇంత లావు మచ్చ, పౌరాణిక సినిమాలో శ్రీరాముడి జబ్బ మీద టీకాలా అయింది ఇంత పెద్దగా" అన్నాడు అనంతకృష్ణమాచారి.

వాడు హరిదాసు నరసింహాచారి గారి అబ్బాయి. ఏ విషయం చెప్పినా పౌరాణిక పాత్రలతో చెప్తాడు.

"రాణీ టీచర్ జడ వాసుకిలా వుంది" అంటాడు.

"మమతా టీచర్ మెడ కింద పౌడర్ నందికేసుడి గంగడోలుకున్న విభూదిలా వుంది" అంటాడు.

ప్రెసిడెంట్‌గారబ్బాయి, వాళ్ళ నాన్న హెల్మెట్, ' మా నాన్నకి స్కూటరుంది ' అని చెప్పడానికన్నట్లు పెట్టుకుని స్కూల్‌కి వచ్చి "ఆచారీ ఎలా వుందిరా?" అంటే వాడు "ఎంత బావుందో, నెత్తిమీద భూభారాన్ని మొత్తం మోస్తున్న వరాహవతారం గుర్తుకి తెస్తున్నావ్" అన్నాడు. వాడు గర్వంగా ఈ విషయం అందరికీ చెప్పుకున్నాడు. "నేను వరాహవతారం" అని.

సీతారామ శాస్త్రిగారు పొట్ట పట్టుకుని చాలాసేపు నవ్వి "వాడు నిన్ను పంది అన్నాడురా" అన్నారు.

"మమతా టీచర్‌కి నంది బీ అన్నయ్ సర్" అని సందానీ చంకలు గుద్దుకున్నాడు.

"పాపం మమతగారిని ఎద్దు అంటావురా?" లింగం చూసుకోవద్దూ, వెధవా?" అని ఆచారిని రెండు అంటించారు.

ఇప్పుడు ఆచారి తను చూసిన పాతసినిమాలో శ్రీరాముడి వేషం వేసిన నటుడి, జబ్బమీద టీకా మచ్చ గుర్తుకు తెచ్చుకుని మరీ, ఏడుస్తున్నాడు.

ఆడపిల్లలు ఏం జరగబోతోందో అర్థమై ఆరున్నొక్కరాగం మొదలుపెట్టారు.

"రేపు మా అక్క పెళ్ళిచూపులు, అమ్మ సున్నుండలూ, కారప్పుసా చేస్తోంది. నాకు జ్వరం వస్తే ఎలా? ఒక్కటీ ముట్టుకోనియ్యదు మా పోలీసు బామ్మ" అని రమాదేవి ఏడ్చింది.

"జ్వరం వస్తుందా?" మెహరున్నీసా కళ్ళు పెద్దవి చేసి భయంగా అడిగింది.

"పోయినసారి నా చేతిమీద ఇంతలావు వాచి, చీము కూడా పట్టింది. అలా పట్టాలనే మా అమ్మ పుట్నాలపప్పు పెట్టింది" అంది స్వరూప.

ధనలక్ష్మి అప్పుడే జబ్బమీద ఇంత లావున వాచి చీము పట్టేసినట్లు ఏడవడం మొదలుపెట్టింది.

"నోర్మూయండి. ఇంజెక్షన్ అంటే వాక్సిన్ మీ మంచికే. లేదా కలరా వచ్చి, ఆస్పత్రి పాలయితే వాళ్ళ జబ్బల మీదా, నడ్డిమీద అందిన చోటల్లా పొడిచి, చివరికి లాభం లేదంటారు" అన్నారు రంగనాథం సార్.

ఎవరికీ లంచ్ తినబద్ధికాలేదు. యమధర్మరాజు దున్నపోతుమీద వచ్చినట్లు ఈ కలరావాళ్ళు ఇంతింత లావు సూదులని గదల్లా భుజాలమీద పెట్టుకుని నల్లని మోటర్ సైకిల్ మీద వస్తారని ఎదురుచూస్తూ కూర్చున్నాం.

మధ్యాహ్నం లాంగ్ బెల్ అవలేదు. అందరం మామూలుగా క్లాస్ రూంల్లోకి వెళ్ళిపోయాం. ఫిలోమినా టీచర్ వచ్చి మేత్స్ చెప్తోంది.

"టీచర్ కలరా ఎప్పుడిస్తారు? అదే కలరా ఇంజెక్షన్. వాక్సిన్ ఎప్పుడిస్తారూ?" అని లేచి అడిగాను.

టీచర్ కోపంగా "ఏం స్కూల్ డుమ్మా కొట్టిపోయి పడుకుందామనా? ఇవాళ వాళ్ళు రావట్లేదుట. ఎప్పుడొస్తారో తెలియదు. చెప్పకుండా వస్తారు" అంది.

ఆచారి బలపాలతో నామాలు పెట్టేసుకుని "గోవింద గోవిందా. చెప్పకుండా వచ్చి పొడిచేస్తారేమో వృషభాసురుల్లా" అని ఏడ్చాడు.

మొత్తానికి ఆ రోజు వేక్సిన్ వాళ్ళు రాలేదు. మాట్లాడుకుంటూ ఇంటికి వెళ్ళిపోయాం. సందానీ మర్నాడు తెల్లారు ఝామున, వాళ్ళ ఆపాజాన్‌తో కలిసి  ఆటో రిక్షాలో వచ్చి ఇంటిముందు దిగాడు. ఆపాజాన్ రెహనా, వాడి పెద్దమ్మ కూతురు, పెళ్ళయిన ఆరేళ్ళలో ఆరుగుర్ని కని, ఏడోవాడిని మోస్తూ, కడుపుతో వచ్చింది. సందానీ డ్రైవర్ చంకలో ఓ పక్కన వున్నాడు. ఇంకో పక్కన ఇంకోడు వున్నాడు.

వీళ్ళు దిగేసరికి ఆటో నడిపే డ్రైవర్‌కి రెండు చేతులూ ఎడం ఎడంగా, చంకలో వాళ్ళు దిగిపోయినా చంకలో గడ్డలొచ్చినట్లు అలాగే వుండిపోయాయి.

"బేగం నాలుగురూపాయిల పావలా అయింది. ఇంకో ఆఠాణా ఎక్కువ ఇప్పించండి. చేతులు దగ్గరకొస్తలేవు" అన్నాడు.

రెహానా ఆపసోపాలు పడ్తూ, నలుగురు పిల్లలు పట్టి లాగితే కానీ దిగలేకపోయింది.

"నస్రీన్, రుక్సానా, ఇక్బాల్, ఇబ్రహీం, సులేమాన్" అని అందరినీ లెక్కపెడ్తూ "హే అల్లా ఒకడు తక్కువయిండు. నువ్వు ఆటో ఎక్కిపియ్యిలే" అని అరిచింది.

ఆటో డ్రైవర్, స్టీరింగ్ కింద వున్న వాడ్నీ, ఎడమ చంకలో వాడ్నీ, కుడి చంకలో వాడ్నీ లాగి చూపించాడు.

ఆమె వాళ్ళని లెక్కపెట్టి  మళ్ళీ "హే అల్లా నాకీ కానుపు అయిపోయినయ్.. ఏడుగురు పిల్లలు దిగినయే" అని అరిచింది.

సందానీ తల కొట్టుకుని "ఆపాజాన్... నేను సందానీ వున్నయ్" అన్నాడు.

ఆమె తెప్పరిల్లి "నాలుగు రూపాయలు సాల్లే. అన్నీ పాలు తాగే పిల్లలున్నయ్. వీళ్ళకి బాడుగ తీస్కుంటావ అన్నా? నీకీ పిల్లలిప్పలేదా ఇంకా?" అని అడిగింది.

కోపంగా ఏదో అనబోయిన డ్రైవర్ "పిల్లలు ఇవ్వలేదా?" అన్న ప్రశ్నకి ముడుచుకుపోయి "ఇంకా లేదు బహెన్. పెళ్ళయి నాలుగేళ్ళయింది" అన్నాడు.

"ఈ పిల్లలకీ పైసలు తీస్కోకు. అల్లా భలాకరేగా" ఆ నాలుగురూపాయిలు అతని చేతిలోపెట్టి, గోనెబస్తాలాంటి సంచితో రెహనా ఇంట్లోకి నడిచింది.

"చోటీ మా క్యాహువా? సందానీకా అబ్బాకో దవాఖానాలో అడ్మిట్ అయిందని చెప్పినయ్" అంది శోకాలు పెడ్తూ.

ఇదంతా నేను సోద్యంగా చూస్తూ ఒక్క జడ వెయ్యగానే రెండో జడ విప్పదీసుకువచ్చి చూస్తూ నిలబడ్డాను. సందానీ తండ్రి గుండ్రాయిలా కూర్చుని 'చాయ్' తాగుతున్నాడు.

జరగనున్న ఉపద్రవం తెలిసి సందానీ గబుక్కున పుస్తకాల సంచీ భుజానికి తగిలించుకుని "ఏవీ రమణీ జల్ది రా ఇస్కూలుకి పోతయ్" అని పరుగు అందుకున్నాడు.

"మీ నాన్న హాస్పిటల్‌లో వున్నాడని ఆపాజాన్‌ని మీ అమ్మ తీసుకురమ్మందని అబద్ధాలు చెప్పావ్రా నువ్వు?" అన్నాను.

"పద పద" అని వాడు పరుగు మొదలుపెట్టి మధ్యలో ఆగి "ఇంతకీ నిన్న ఇంజిషన్‌లు ఇచ్చినయా?" అన్నాడు.

"ఆ!" అని నేను జబ్బ పట్టుకుని "ఇచ్చారు. ఇంతలావున వాచింది. ఒకటే నెప్పి" అన్నాను.

సందానీ మొహంలో నవ్వు వచ్చింది. కానీ ఆ రోజు ప్రేయర్ అవగానే, మా హెడ్ మాస్టర్ "క్లాసులకి వెళ్ళకండి. అలాగే లైన్‌లో నిలబడండి" అన్నారు.

మేం లైన్లో నిలబడ్డాం. అందరికన్నా ముందున్న సందానీని "కమాన్ స్టార్ట్ ఇక్కడినుండి" అన్నారు హెడ్ మాస్టర్.

సందానీ ఆఫీస్ రూంలోకెళ్ళడం, గావు కేకలు వినపడడం వెంటవెంటనే జరిగిపోయాయి.

వాడు ఏడుస్తూ జబ్బ పట్టుకునొచ్చి నాకేసి కోపంగా చూసాడు.

రంగనాథం మాష్టారు "ఏరా భడవా? డాక్టర్‌గారికి రమ్మని కబురు పంపితే, బడి డుమ్మా కొట్టేస్తావా? కరి మింగిన వెలగపండులా ఎన్ని తెలివితేటలున్నాయి ఆ బుర్రలో" అన్నారు.

"అండపిండ బ్రహ్మాండంలో ఆంబోతు రంకేస్తే అక్కడ తగులు ఇక్కడ తగులు. కుడి పిర్రకి తగులు బోడి బుర్రకి తగులు అన్నట్లుంది సార్" అని ఏడుస్తూ వచ్చాడు ఆచారి.

ఇది చిన్నప్పుడు స్కూల్లో వాక్సిన్‌లు వేసినప్పటి విషయం. పిల్లలు తప్పించుకో చూసేవాళ్ళు. మా బామ్మ మా నాన్నని దాచేసి "ఇంట్లో లేడు" అని చెప్పేదట. పిల్లాడికి ఇంజెక్షన్ నొప్పిపెడుతుందని. అలా కొందరు పెద్దలు అవగాహన లేక ఇప్పించేవారు కారు వేక్సిన్‌లు.


కానీ ఇప్పుడు కరోనా భూతం ఏడాదిగా "నేను అణువునైనా పరమాణువు నైనా నాకు అండపిండ బ్రహ్మాండం మొత్తం భయపడాల్సిందే అంత పవర్‌ఫుల్ వైరస్‌ని" అని నిరూపించేసింది. అందరం పనులు మానేసి ఇళ్ళల్లో బందీలుగా ఏడాది గడిపేసాం. ముక్కుకి బట్టా, చేతిలో శానిటైజర్ శంఖం చక్రంలా ధరించకుండా కదిలే పనేలేదు. ఎవరెవరో పోయారని రోజూ వార్తలు. ఉన్నవాళ్ళూ లేనివాళ్ళూ అనే బేధం చూపని అసలైన సోషలిస్టు ఈ కోవిడ్

సరే.. వాక్సిన్‌లు కనిపెట్టారు మన శాస్త్రజ్ఞులు. ప్రపంచం అంతా ఇంక వేక్సిన్‌ల పండగొచ్చినట్లు, ముందు వయోవృద్ధులూ తీపీ, కారంలాంటి రోగాలున్న వాళ్ళూ, ఫ్రంట్ లైన్ వర్కర్సూ అంటూ వాక్సిన్‌లు రిజిష్టర్ చేయించుకుని, వాక్సిన్ తీసుకుని ఫేస్‌బుక్‌లో ఫోటోలు పెట్టుకుని పండగ చేసుకున్నాం. ఇంకా తీసుకోని వాళ్ళ పరిగెత్తేట్టు చేసాం.

'హమ్మయ్యా' అని నిట్టూర్చేలోపే ఓ ప్రముఖుడు ఫోన్ చేసి "రెండో డోస్ వాక్సిన్ తీసుకున్న నెల తర్వాత నిన్న కోవిడ్ పాజిటివ్ వచ్చింది నాకు... వాక్సిన్ తీసుకున్నాం కదా అని అజాగ్రత్తగా వుండకండి. ఏంటీ బాడీస్ డెవలప్ అవుతాయి కానీ కోవిడ్ నుండి రక్షణ కాదు. మాస్కూ, శానిటైజర్ చేతులు కడుక్కోవడం సోషల్ డిస్టెన్సింగ్ తప్పవు" అని చెప్పారు.

'హతవిధీ' ఈ వేక్సిన్ మనని 'ఏప్రిల్ ఫూల్' చెయ్యడం లేదుకదా!

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4